
విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాప్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
శుక్రవారం 28 - 02 - 2025

# ప్రజలకు అవసరమైన డ్రగ్స్, సర్జికల్స్ అందుబాటులో ఉంచాలి

- ఫార్మాసిస్టులు ఎక్కడా మందులు కొరతా రాకుండా చూసుకోవాలి
- సరిగ్గా పనిచేయని ఫార్మాసిస్టులపై చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్





అనంతపురం, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు అవసరమైన డ్రగ్స్, సర్జికల్స్ ఖచ్చితంగా అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. గురువారం అనంతపురం నగరంలోని శారద నగర్ లో ఉన్న ఏపీఎంఎస్ఐడిసి సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన మందుల సరఫరాలో ఎలాంటి లోటు ఉండరాదన్నారు. క్షేత్రస్థాయిలో ఆసుపత్రులకు కావాల్సిన అన్ని రకాల మందులకు సంబంధించి ఆన్లైన్ లో ఇండెంట్ పెట్టుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క ఫార్మాసిస్టులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని, డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఎస్, జిజిహెచ్ పరిధిలోని ఆసుపత్రులలో ప్రతిరోజు తనిఖీ చేసి అవసరమైన ఇండెంట్ ఇవ్వాలన్నారు. సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ నుంచి సమయానికి మందులు రాలేదు అనేది ఎక్కడా రాకూడదని, షెడ్యూల్ పెట్టుకొని ఆసుపత్రులకు మందులు సరఫరా చేయాలని, ఇందులో ఎలాంటి అంతరం రాకూడదన్నారు. ఆసుపత్రులలో ఫార్మాసిస్టులు, డాక్టర్లు ఇంటరాక్ట్ కావాలని, కావాల్సిన మందులు అడగాలన్నారు. జిజిహెచ్ పరిధిలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఎంత మంది ఫార్మాసిస్టులు అవసరమవుతుందో స్టడీ చేయాలని, జిజిహెచ్ లో 22 మంది ఉండగా, కొందరిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి నియమించేలా చూడాలన్నారు. ఫార్మాసిస్టులు ఎక్కడా మందులు కొరతా రాకుండా చూసుకోవాలని, సరిగ్గా పనిచేయని ఫార్మాసిస్టులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆన్లైన్లో 740 రకాల మందులు ఉన్నాయని, ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులోకి తీసుకొచ్చే బాధ్యత ఫార్మాసిస్టులదే అన్నారు. ఏపీఎంఎస్ఐడిసి, ఫార్మాసిస్టుల మధ్య సమాచారం ఉండాలని, అందరూ సమయానికి తగ్గట్టుగా పని చేయాలన్నారు. జిజిహెచ్ పరిధిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఉన్నా కూడా వేర-వేరుగా ఉన్నాయని, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి కూడా ప్రత్యేకంగా ఐడి క్రియేట్ చేయాలని, ఇందుకు సంబంధించి హెల్త్ సెక్రెటరీకి లెటర్ రాయలన్నారు.

ఈ కార్యక్రమంలో డ్రగ్స్ ఎడి రమేష్ రెడ్డి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున, ఏపీఎంఎస్ఐడిసి ఈఈ శ్రీనివాస నాయక్, ఫార్మసిస్టులు ఓబయ్య, ఫయాజ్, చంద్రశేఖర్, ఫార్మసీ మెడికల్ ఆఫీసర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వేని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



అనంతపురం, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

రీసర్వేని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. గురువారం సింగనమల మండలంలోని మట్లగొంది గ్రామ పరిధిలో, పెద్ద పప్పూరు మండలంలోని చిన్న ఎక్కలూరు గ్రామంలో, యాడికి మండలంలోని చందన గ్రామంలో, గుత్తి మండలంలోని కొజ్జేపల్లి పరిధిలో జరుగుతున్న రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే పైలెట్ గ్రామాలలో రీసర్వే టీం సభ్యులు నిర్ణీత సమయానికి హాజరుకావాలన్నారు. రీసర్వే కోసం ప్రతి గ్రామంలో 4 టీంలు ఏర్పాటు చేయగా, ఉదయం రెండు టీంలు, మధ్యాహ్నం రెండు టీంలు గ్రౌండ్ ట్రూ థింగ్ ప్రక్రియను ప్రజల సమక్షంలో చేయడం జరుగుతోందన్నారు. ప్రజలకు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి వారి గ్రామంలో ఏరోజు ఎక్కడ రీసర్వే జరుగుతుందో సమాచారం ఇవ్వడం జరుగుతోందని, రీసర్వేని ఉపయోగించుకోవలని కోరారు. క్షేత్రస్థాయిలో పక్కాగా రీసర్వే చేపట్టాలని రీసర్వేని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని, రీసర్వేపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ సరిహద్దులు, బ్లాక్ సరిహద్దులు, ప్రభుత్వ స్థలాలు సరిహద్దులను పక్కగా నిర్ణయించాలన్నారు. రీ సర్వే గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని, వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు. రీసర్వే చేసే పొలాల సమాచారం రైతులకు ముందుగా తెలిపి వారి సమక్షంలో సర్వే పనులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, వంకలు, రహదారులు విస్తీర్ణములు సక్రమంగా నమోదు చేయాలన్నారు. వివాదమైన భూముల విషయంలో ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కెఆర్సిసి ఎస్డిసి తిప్పేస్వామి, సర్వే ఏడి రూప్ల నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ 94.వర్ధంతి ఘనంగా వేడుకలు



ఉరవకొండ, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

దేశమాత విముక్తి కోసం తృణప్రాయంగా ప్రాణాల అర్పించి అమరజీవి గా కీర్తి ప్రతిష్టలు గురించిన ఆజాద్ చంద్రశేఖర్ వర్ధంతి వేడుకలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు.భారతదేశ స్వతంత్ర ఉద్యమంలో దేశమాత విముక్తి కోసం ప్రాణాలు తృణప్రాయంగా అర్పించిన చంద్రశేఖర్ ఆజాద్, యువతకు స్ఫూర్తిదాయకమని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు నందు అన్నారు, చంద్రశేఖర్ ఆజాద్ 94వ వర్ధంతి ఉరవకొండ స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్ నందు, భారత విద్యార్థి పెడరేషన్ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ 94వ వర్ధంతి ఘనంగా నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు నందు,మాట్లాడుతూ,

భారత స్వాతంత్ర్యోద్యమంలో దేశమాత విముక్తి కోసం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా మరియు అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైల్లు పరిగెత్తించిన ఈయన మనదేశం గర్వించదగ్గ అసమాన వీరుడు ,సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ అజాద్ వర్ధంతి,భగత్ సింగ్ మార్గ నిర్దేశకుడిగా పేరుగాంచిన చంద్రశేఖర్ ఆజాద్ పూర్తిపేరు చంద్రశేఖర సీతారామ్ తివారి. ఈయన పండిత్‌జీగా కూడా పిలువబడ్డారు.

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝాబువా జిల్లా, బాద్రా (భాబ్ గా) గ్రామంలో పండిట్ సీతారామ్ తివారి, జగరానీ దేవీలకు 1906 జూలై 23వ తేదీన చంద్రశేఖర్ ఆజాద్ జన్మించారు. ప్రాథమిక విద్యను సొంత గ్రామంలోనే పూర్తి చేసిన ఈయన వారణాసిలో సంస్కృత పాఠశాలలో హయ్యర్ సెకండరీ విద్యను అభ్యసించారు.లి

1919లో అమృత్‌సర్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ దుర్ఘటనతో తీవ్రంగా కలతచెందిన ఆజాద్.. ఆ తరువాత 1921లో మహాత్మాగాంధీ నడిపిన సహాయ నిరాకరణోద్య మంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొన్న నేరానికిగానూ ఈయన తన పదిహేనేళ్ల ప్రాయంలోనే అరెస్టయ్యారు.లి

విచారణ సందర్భంగా కోర్టులో “నీ పేరేంటి?” అని మెజిస్ట్రేట్ అడిగిన ప్రశ్నకు ఆయన పెద్ద శబ్దంతో “ఆజాద్” అని అరచి చెప్పారు. దాంతో ఆయనకు మెజిస్ట్రేట్ 15 కొరడా దెబ్బలు శిక్షగా విధించాడు. అయితే ప్రతి కొరడా దెబ్బకు ఆయన భారత్ మాతాకీ జై (వందేమాతరం) అంటూ గొంతెత్తి నినదించారు. ఇక అప్పటినుంచి చంద్రశేఖర్ ఆజాద్‌గా ఆయన పేరు స్థిరపడిపోయింది.

సహాయ నిరాకరణోద్యమం ఆజాద్‌లో దాగి ఉన్న విప్లవవాదిని మేల్కొలిపింది. ఎలాగైనా సరే భారతదేశాన్ని బ్రిటీష్‌వారి కబంధ హస్తాల నుంచి విడిపించాల్సిం దేనని ఆయన బలంగా నిశ్చయిం చుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆయన హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను స్థాపించారు. భగత్ సింగ్, సుఖదేవ్, తదితరులకు మార్గనిర్దేశకుడిగా మారారు.

1928వ సంవత్సరంలో పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి కన్నుమూసిన ‘పంజాబ్ కేసరీ లాలాలజపతిరాయ్ మృతికి ప్రతికారంగా రాజ్ గురు, భగత్ సింగ్, బ్రిటీష్ పోలీస్ అధికారి సాండర్స్ ను కాల్చి చంపగా, సాండర్స్ వెంట వచ్చిన హెడ్ కానిస్టబులు రాండ్ ను చంద్రశేఖర్ ఆజాద్ కాల్చి చంపాడు. ఉత్తర ప్రదేశ్, పంజాబ్ ప్రభుత్వాలు చంద్రశేఖర్ ఆజాద్ ను సజీవంగా పట్టుకునే ప్రయత్నం చేశాయి. అతనిని ప్రాణాలతో తీసుకువచ్చినా లేక చంపి తెచ్చినా 30 వేల రూపాయలు బహుమతిగా ప్రకటించారు.

అ రోజు 1931, ఫిబ్రవరి 27, శుక్రవారం అలహాబాదులోని ఆల్ఫ్రెడ్ పార్క్‌కు చేరుకోగా, ఇన్ఫార్మర్లు ఇచ్చిన సమాచారం మేరకు బ్రిటీష్ పోలీసులు చుట్టుముట్టారు. చంద్రశేఖర్ ఆజాద్ ను లొంగిపోవాలంటూ హెచ్చరికలు చేశారు. అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పోలీసులకు లొంగకుండా, ఒక్కడే పోరాడుతూ ముగ్గురు పోలీసులను హతమార్చారు. అలసిపోయేదాకా పోరాడిన ఆయన చివరి క్షణంలో తన వద్ద మిగిలిన ఒకే ఒక్క బుల్లెట్‌తో తనను తానే కాల్చుకుని అశువులు బాసారు. తన చివరి క్షణం వరకూ భారతమాత కోసం పోరాడి శత్రువుకు చిక్కకుండా ఎంతో నిబ్బరంగా తననుతాను కాల్చుకోని వీరమరణం పొందాడు అజాద్ . ఈయన త్యాగం అజరామయం. జోహార్ చంద్రశేఖర అజాద్ జోహార్ అని కొనియాడారు,ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు,తరుణ్, వెంకీ, వంశీ, ధనుంజయ , అవినాష్, తదితరులు పాల్గొన్నారు ...

## డంపింగ్ యార్డ్ తొలగించి, ప్రజల ప్రాణాలను కాపాడండి - సిపిఎం





అనంతపురం, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

అనంతపురం డంపింగ్ యార్డ్ ను తొలగించాలని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు రాజీవ్ కాలనీ పంచాయతీలోని పలు కాలనీలలో పాదయాత్ర నిర్వహించారు .ఈ పాదయాత్రను ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప మాట్లాడుతూ నగరం లోని ప్రజలతోపాటు ,రాజీవ్ కాలనీ పంచాయతీ ప్రజలు తీవ్రమైన కలుషితమైన గాలి దుర్వాసన పీల్చి అనారోగ్యాల పాలవుతున్నారని విమర్శించారు .ప్రభుత్వాలు ఎన్ని వచ్చి నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని విమర్శించారు. డంపింగ్ యార్డ్ నుంచి విపరీతమైన పొగ రావడంతో రాజీవ్ కాలనీ ప్రజలు అనారోగ్యాల పాలై హాస్పిటల్ పాలవుతున్నారని తెలిపారు. ఈరోజు చేసిన పాదయాత్రలో తెలుగుదేశం, వైసిపి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, కాలనీ పెద్దలు పాల్గొని మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీమతి ఆషాభి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఎన్నిసార్లు తీసుకుపోయిన సమస్య పరిష్కారం కావడం లేదని వాపోయారు. మంటలు లేచి విపరీతమైన పొగ వచ్చి రాజీవ్ కాలనీ పంచాయతీలోని ఇండ్లు కనబడకుండా పోతున్నాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు రసూల్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ విషయం మీద పార్టీలకతీతంగా అందరం కలిసి వస్తామని తెలిపారు మేము ఎమ్మెల్యే గారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఖాజా మాట్లాడుతూ రామయ్య కాలనీకి పక్కనే డంపింగ్ యార్డ్ ఉండడం చేత రాత్రింబవళ్లు విషపు గాలిని పీల్చుకొని అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర కార్యదర్శి రామి రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ఆర్ వి నాయుడు ,ముర్తుజ రాజీవ్ కాలనీ మాజీ సర్పంచ్ హుస్సేన్, ఉప సర్పంచ్ మసూద్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు వలీ, నగర కమిటీ సభ్యులు ఎన్టీఆర్ సీన ,వెంకట, రాజు, వెంకటేశు ,గపూరు, జీవ, లతీఫ్ కాలనీ పెద్దలు డేవిడ్, చిదంబరయ్య, బిఎస్ఎన్ఎల్ భాష, అనిల్, రాము, నూరుల్లా,రామాంజీ, ఇస్మాయిల్, శంషాద్ ,లత, హాజీ వలీ ,నరసింహ తదితరులు పాల్గొన్నారు


## శివరాత్రి ఉత్సవాల్లో పరిటాల శ్రీరామ్ - ఎడ్ల బండి పై ఆలయం చుట్టూ ప్రదక్షణలు



ధర్మవరం, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

నియోజకవర్గంలో శివరాత్రి సందర్భంగా పలు ఆలయాల్లో జరిగిన ఉత్సవాల్లో తెలుగుదేశంపార్టీ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ముందుగా ముదిగుబ్బ మండలం సంకేపల్లి పంచాయతీలోని గొంగట లింగయ్యగారి పల్లిలో జరిగిన వీర నారాయణస్వామి ఉత్సవానికి హాజర-య్యారు. శ్రీరామ్ కు ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారు. ఆలయంలో వీరనారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఎడ్లబండి పై ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. ఆ తర్వాతి చిల్లవారిపల్లి శ్రీ కాటకోటేశ-్వర స్వామి క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. జిల్లాలో నలుమూలలు నుంచే కాకుండా రాయలసీమలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడంతో క్షేత్రం కిక్కిరిసిపోయి కనిపించింది. ఆలయ నిర్వాహకులు, పూజా కార్యక్రమాలు నిర్వహించే వారు శ్రీరామ్ కు ఘనస్వాగతం పలికారు. ముందుగా కాటమయ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు, అధికారులతో ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులను శ్రీరామ్ పలుకరించారు. భక్తులు సంయమనంతో ఉండి స్వామి వారిని దర్శించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గ ప్రజలపై స్వామి వారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు

## ఘనంగా కోన రామలింగేశ్వర స్వామి కళ్యాణం, రథోత్సవం



యాడికి, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

యాడికి మండలం కోనుప్పలపాడు గ్రామ సమీపంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కోన రామలింగేశ్వర స్వామి ఆలయము నందు మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణం కనుల పండుగగా నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో అలంకరించారు. కోన రామలింగేశ్వర స్వామికి గురువారం వేకుజామునే ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ పెద్దల మరియు భక్తుల ఆధ్వర్యంలో కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఉంచి రథోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణం, రథోత్సవాన్ని చూడడానికి యాడికి మండలంతో పాటు పలు మండలాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యాడికి ఎస్సై వెంకటరమణ తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశాడు. ఈ వేడుకలకు క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి, తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## సింగనమల మండల కేంద్రం ఎస్సీ కాలనీ లో అర్ధాంతరంగా ఆగిపోయిన అంగన్వాడి కేంద్రం



శింగనమల, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

సింగనమల మండలం శివపురం సిపిఐ శాఖ జనరల్ బాడీ సమావేశం శివపురం గ్రామంలో జరిగినది.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ, గ్రామాలలో మౌలిక వసతులు అయిన త్రాగినీరు వీధిలైట్లు విష జ్వరాలు ప్రబలకుండా మురికి కాలువల పరిశు భ్రత,వీధీకోళాయిలు

ఏర్పాటుచేయడము, గ్రామీణ రోడ్లు వేయడం గ్రామాలలో వలసలు పోకుండా పనులు కల్పించడం ప్రభుత్వ రంగ బాధ్యత వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని తక్షణమే గ్రామాలలో వేసవి కాలం మొదలైనందున మౌలిక వసతుల పైన దృష్టి సారించాలని సిపిఐ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం. శివపురం గ్రామంలో సిపిఐ గ్రామ కమిటీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగినది. శాఖ కార్యదర్శిగా ఆదినారాయణ, సహాయ కార్యదర్శులుగా రాముడు ,రామాంజనేయులు తొమ్మిది మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు మధు యాదవ్, చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి చేనేత మధు, మరియు భాస్కర్, రాజమ్మ, వేదవతి ,భాగ్యలక్ష్మి, రామాంజనమ్మ ,లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

AP 4PG 28 02 2025 FRIDAYqxp_Layout 1 27-02-2025 10:14 PM Page 2



## చందన గ్రామములో రీసర్వేను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



యాడికి ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

యాడికి మండలము చందన గ్రామం నందు జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని గురువారం అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ శివ నారాయణ శర్మ మరియు డిస్టిక్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసర్ శ్రీ రూప్లా నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాల్గొన్న రైతులను వారి యొక్క సమస్యల గురించి అధికారులు చర్చించారు, అనంతరం జిల్లా అధికారులు మాట్లాడుతూ ఈ రీ సర్వే ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బంది రైతులకు ముందుగానే వారి భూముల వద్ద జరుగు రీ సర్వే చేసే భూముల సమాచారం ముందుగా తెలిపి వారి సమక్షంలో రీ సర్వే పనులు నిర్వహించాలన్నారు, వివాదమైన భూముల విషయంలో ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు, రీసర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం నందు యాడికి మండల తహసిల్దార్ ప్రతాప్ రెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ రాజ్ కుమార్, మండల డిప్యూటీ సర్వేయర్ శేష సాయి మరియు గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు

## శివనామస్మరణతో మారు మ్రోగిన శివాలయాలు





యాడికి, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని యాడికి మండలంలోని పలు శివాలయాలు శివనామస్మరణతో మారుమొగాయి. యాడికి మండల కేంద్రంలోని కొండమీద ఉన్న శ్రీ విజయాంబికా భైరవలింగేశ్వర స్వామి ఆలయం నందు, బస్టాండు సర్కిల్ వద్ద ఉన్న శ్రీ బోగలింగేశ్వర స్వామి ఆలయం నందు శివపార్వతుల విగ్రహాలను అలంకరించి కళ్యాణాన్ని కమనీయంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ పెద్దలు భక్తుల సమక్షంలో నిర్వహించారు, చిన్న వేపమాను వీధి సమీపంలో ఉన్న శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయం నందు, హై స్కూల్ సమీపాన నాగుల కట్ట వద్ద ఉన్న శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం నందు, స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు, అనంతరం పలు దేవాలయాల దగ్గర భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రము శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఉంచి పురవీధుల గుండా ఊరేగించారు

## నేడు, రేపు విద్యుత్ అంతరాయం



యాడికి, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

యాడికి మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మత్తుల దృష్ట్యా నేడు రేపు విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని ఇన్చార్జ్ విద్యుత్ ఏ ఈ రాజారావు తెలిపారు. కోనుప్పలపాడు సబ్ స్టేషన్లో శుక్రవారం మరమ్మతులు చేపడుతున్న ఆ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని, అలాగే రాయల చెరువు సబ్ స్టేషన్లో శనివారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నందున ఆ పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని, కావున నేడు రేపు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విధించే ఈ అంతరాయాన్ని గమనించి ప్రజలు సహకరించాలని ఆయన తెలిపారు

## తప్పిపోయిన బాలికను గంటలో వెతికి తల్లి తండ్రికి అప్పగించిన అనంతపురం వన్ టౌన్ పోలీసులు



అనంతపురం, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

ఈరోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన కూతురు స్కూల్ నందు కనిపించడం లేదని అనంతపురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కి వచ్చి సుమారు మధ్యాహ్నం 12:30 గంటలకు ఫిర్యాదు చేయగా వెంటనే సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ స్పందించి ఎస్ఐ శ్రీనివాస్ మరియు సిబ్బందిని టీములుగా విభజించి వెతికించి తప్పిపోయిన తొమ్మిది సంవత్సరముల బాలికను తల్లిదండ్రులకి అప్పగించారు. అందుకు తల్లి తండ్రి పోలీసు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## అధిక వడ్డీలు వసూలు చేసి ప్రజలను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు.. కళ్యాణదుర్గం పట్టణ సిఐ యువరాజ్



కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

వడ్డీ వ్యాపారస్తులు ప్రజలకు అప్పులు ఇచ్చి వారి నుంచి అధిక వడ్డీ వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కళ్యాణ్ దుర్గం పట్టణ సీఐ యువరాజ్ వడ్డీ వ్యాపారస్తులను హెచ్చరించారు గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో సిఐ యువరాజ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కల్యాణదుర్గంలో వడ్డీ వ్యాపారస్తుల నుంచి ప్రజలకు ఇబ్బంది పెడుతు సమస్యలు సృష్టించడం తమ దృష్టికి వచ్చిందని వడ్డీ వ్యాపారస్తులు ప్రజలకు అవసరాన్ని బట్టి వారికి డబ్బులు ఇస్తూ ఐదు రూపాయలు పది రూపాయలు వంటి అధిక వడ్డీలతో బాధితులను వేధిస్తున్నారని కొంతమంది బాధితులు నుంచి ఫిర్యాదులందుతున్నాయని అదేవిధంగా వడ్డీ వ్యాపారులు బాధితుల నుంచి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడం దినసరి అధిక వడ్డీలతో బాధితులను భయపెట్టడం వేధించడం ఇళ్ల వద్దకు వెళ్లి దుర్భాషలాడడం వంటి కార్య కలాపాలు చేస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు చేపడతామని సీఐ యువరాజ్ వడ్డీ వ్యాపారస్తులను హెచ్చరించారు పట్టణంలో ఈ మధ్యకాలంలోనే ఇటువంటి చర్యలు ఎక్కువ అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అటువంటి బాధితులు ఎవరైనా పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు

## శివపురం ఎస్సీ కాలనీలో తీవ్ర తాగునీటి సమస్య..

- బోర్ వేసి మోటర్ బిగించిన ఆర్డిటి సంస్థ..
- మోటార్ కి కరెంటు ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యం..
- నిర్లక్ష్యం నీడలో విద్యుత్ అధికారులు,సిక్స్ వే రోడ్డు కాంట్రాక్టర్లు..
- 100 గజాల విద్యుత్ లైన్ కోసం 100 రోజుల నుండి నిరీక్షణ...!



శింగనమల, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

శింగనమల మండలం చక్రాయపేట పంచాయతీలోని శివపురం ఎస్సీ కాలనీలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొందని ఎస్సీ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తమకు తాగునీటి సమస్య ఉందని అధికారులకు,ప్రజా ప్రతినిధులకు ఎన్ని మార్లు చెప్పిన స్పందించకపోవడంతో చివరకు ఆర్డిటి స్వచ్ఛంద సంస్థకు తెలిపడంతో స్పందించిన ఆర్డిటి స్వచ్ఛంద సేవ సంస్థ వారు ఎస్సీ కాలనీలో బోరు వేయించి మోటార్ బిగించడం జరిగిందని కాలనీవాసులు తెలిపారు.అయితే విద్యుత్ అధికారులపై సిక్స్ వే రోడ్డు కాంట్రాక్టర్ సిక్స్ వే రోడ్డు కాంట్రాక్టర్ పై విద్యుత్ అధికారులు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ మోటార్ కు విద్యుత్ సప్లై చేయడకపోవడంతో తమ కాలనీలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాము కిలోమీటర్ దూరంలో వెళుతున్న చెరువు పెద్ద కాలువ నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలియజేశారు.ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.ప్రధాన రహదారి ప్రక్కన త్రీఫేస్ లైన్ వుందని రోడ్డు ఇటు ప్రక్కకు కేవలం 100 గజాల దూరంలోని మోటార్ కు విద్యుత్ సప్లై చేయడానికి 100 రోజుల నుండి నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు విమర్శించారు

## దళితులకు రక్షణ కల్పించాలని అసిస్టెంట్ కలెక్టర్ ను కోరిన ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ నేరిమెట్ల ఎల్లన్న




కూడేరు, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

కూడేరు మండలం స్థానిక మండల పరిధిలోని కడదరకుంట గ్రామంలో ఇటీవల దళితులపై జరిగిన దాడులను ఖండిస్తూ తాసిల్దార్ కార్యాలయం నందు గురువారం రోజున ఎస్సీ ఎస్టీ కమిటీ అధ్యక్షులు నేరమెట్ల ఎల్లన్న ఆధ్వర్యంలో దళితులతో కలిసి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. తాసిల్దార్ కార్యాలయంలోని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న ను మర్యాదపూర్వకంగా కలిసి ఎస్సీల పై దాడులు, భూ సమస్యల పైన చర్చించారు. పోలీస్ , రెవెన్యూ అధికారులు దళితులకు అండుగా ఉండాలని దళిత , గిరిజన సంఘాల నాయకులు అసిస్టెంట్ కలెక్టర్ ను కోరడం జరిగింది. అందుకు స్పందించిన అసిస్టెంట్ కలెక్టర్ దళితులకు అండగా ఉంటామని శాంతి భద్రతలు కాపాడుతామని చట్ట పరిధిలో దళితులకు న్యాయం చేస్తామని అసిస్టెంట్ కలెక్టర్ దళిత నాయకులకు, బాధితు కుటుంబాలకు తెలియజేయడం జరిగింది. నిబంధనలు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించొద్దని ఆమె తెలియజేశారు. బాధితులకు రక్షణ కల్పిస్తూ సమస్యను తొందరలోనే పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ అధ్యక్షులు నేరిమెట్ల ఎల్లన్న, ఎస్సీ ఎస్టీ పోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, నాయకులు కెపి నారాయణస్వామి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు,, హనుమంతు ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎమ్మెస్ ఎఫ్ నాయకులు నాగేష్, రామాంజనేయులు, దళిత నాయకులు, మీనుగా రామాంజనేయులు, ఎస్సీ ఎస్టీ ఫోరం నాయకులు, బాధితులు కిష్టప్ప, వెంకటేశులు, రామచంద్ర ఆదిలక్ష్మి,, రమేష్ పెద్దన్న,తదితరులు పాల్గొన్నారు

## జ్ఞానం, ఆరోగ్యం సంపదకు మూలం శివుడే -శివాభిషేకంతో మొత్తం విశ్వం చల్లబడుతుంది.



ఉరవకొండ, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

మహాశివరాత్రి పర్వదినాన భక్తులు శివాలయాలు మొత్తం రుద్రాభిషేకాలు, శివాభిషేకాలు, రుద్ర నమక చమకాలతో చేశారు. ఉరవకొండ పట్టణంలోని గవి మఠంలో వెలసిన సిద్దేశ్వర దేవస్థానంలో, ఉరవకొండ పై వెలసిన బడే సోమప్ప దేవస్థానంలో, అతి పురాతన మల్లేశ్వర దేవస్థానంలో, నీలకంఠేశ్వర దేవస్థానం, మార్కండేయ దేవస్థానం, వెలిగొండ సిద్దేశ్వరాలయాలు, పెద్ద ముస్తూరు లోనిమూడు రాళ్లతో నిర్మించిన సిద్దేశ్వర దేవస్థానాలలో ఉదయం నుంచి భక్తుల పూజలతో పోటెత్తిపోయాయి. జ్ఞానం ఆరోగ్యం సంపదలకు మూలం శివుడే అన్న భావన భక్తుల్లో ఉంది..శివరాత్రి పర్వదినాన ప్రముఖ శైవ క్షేత్రాలన్నీ శివ నామ స్మరణతో మారుమోగిపోగాయి.శివారాధనలో లింగరూపంలో పూజిస్తారు. ప్రతి లింగంలోనూ శివుని జ్యోతి స్వరూపం వెలుగుతుందని నమ్మకం. మహాశివరాత్రి పర్వదినాన శివాలయాల్లో భక్తుల రద్దీ కనిపిస్తుంది. అభిషేకాలు , పూజలతో పరమశివుని ఆరాధిస్తారు. దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఈ విశిష్ట దినాన రోజంతా ప్రత్యేక పూజలు జరుపుతారు.రాత్రి కూడా దేవాలయాలు తెరిచే ఉంటాయి.పూజలు,భజనలతో శివనామం మారుమోగుతుంటుంది.

ఈ పర్వదినాన లింగాష్టకం , శివ పంచాక్షరి జపిస్తారు. దీపారాధన చేసి , భక్తి ప్రపత్తులతో రుద్రాభిషేకం చేస్తారు. శివపార్వతుల కల్యాణం చేస్తారు. రోజంతా పరమేశ్వరుని ప్రార్థనలతో , చింతనలో గడిపి , రాత్రి జాగారం చేస్తారు. శివరాత్రి పర్వదినానికి ఉపవాసం, జాగారం ముఖ్యం.

భక్తులు ఉపవాసం, జాగారం ఎందుకు చేస్తారు ?

అమృతం కోసం దేవ,దానవులు క్షీరసాగర మథనం చేశారు. అప్పుడు అమృతం కంటే ముందు హాలాహలం పుట్టింది. హాలాహలాన్ని అలాగే విడిచిపెట్టేస్తే అది ముల్లోకాలనూ దహించేసే ప్రమాదం ఉండటంతో దేవదానవులందరూ భయాందోళన చెందారు. హాలాహలం బారి నుంచి లోకాలను రక్షించాలంటూ మహాదేవుడైన శంకరుడిని శరణు వేడారు. లోక రక్షణ కోసం ఆ గరళాన్ని తానే మింగి , గొంతులో బంధించి అలా గరళకంఠుడయ్యాడు. హాలాహల ప్రభావానికి శివుడి కంఠం కమిలి , నీలంగా మారడంతో నీలకంఠుడిగా పేరుపొందాడు. గరళాన్ని గొంతులో బంధించడం వల్ల అది శివునిలో విపరీతమైన తాపాన్ని పుట్టించసాగింది. ఆ తాపాన్ని తగ్గించుకోవడానికి క్షీరసాగర మథనంలో పుట్టిన చంద్రుడిని తలపై ఉంచుకున్నాడు. నిరంతర తాపోపశమనం కోసం గంగను కూడా నెత్తిన పెట్టుకున్నాడు.

లిఅయినా, శివుడిని హాలాహల తాపం ఇబ్బంది పెడుతూనే ఉంటుందట. అందుకే భక్తులు నిత్యం శివలింగానికి అభిషేకం చేస్తూ ఉంటారు. హాలాహలం మింగినప్పుడు దాని ప్రభావానికి శివుడు మూర్ఛిల్లాడట. ఆందోళన చెందిన దేవతలు శివుడికి మెలకువ వచ్చేంత వరకు జాగారం చేశారట. అందుకే ఏటా మాఘ బహుళ చతుర్దశి నాడు వచ్చే మహాశివరాత్రి రోజున భక్తులు ఉపవాసం చేసి, జాగారం ఉంటారు. జాగారం ఉన్న సమయంలో శివనామ సంకీర్తనతోనూ , జప ధ్యానాలతోనూ కాలక్షేపం చేస్తారు. ఇదంతా మహాశివరాత్రి పర్వదినానికి గల పౌరాణిక నేపథ్యం.

## గ్రామాల అభివృద్ధి కాగితాలకే పరిమితమా.. అధ్వాన స్థితిలో గ్రామీణ ప్రాంత రహదారులు..



శింగనమల, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

గోవిందరాయుని పేట ఊరి రహదారి వైపు ఓసారీ చూడండి...కంకర వేసారు తార వేయడం మరిచారు...రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో వున్న గ్రామీణ ప్రాంతాల అభివృద్ధినే తమ ధ్యేయమనీ నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తుంటారు.అయితే అవన్ని కాగితాలకే పరిమిత మవుతున్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి వివరాలోకి వెళితే శింగనమల మండలంలోని గోవిందరాయునిపేట గ్రామ రహదారి చాలా అధ్వాన స్థితిలో వుంది....రహదారి అంతా కంకర తోలి తార వేయకుండా అలాగే వదిలేసారు.దీంతో ఈ రహదారిన నడవాలంటే నరకం చూడాల్సిన పరిస్థితి ఎర్పడుతుందని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీ సంగమేశ్వర స్వామి రథ నిర్మాణానికి ,లక్ష, రూ , విరాళాలన్ని అందజేసిన బొమ్మినేని ఎర్రిస్వామి



కూడేరు, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

కూడేరు మండలం స్థానిక మండల కేంద్రంలోని మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రోజున శ్రీ సంగమేశ్వర స్వామి నూతన రథం నిర్మాణం కొరకు కూడేరు గ్రామానికి చెందిన బొమ్మినేని ఎర్రి స్వామి 1.00000 లక్ష రూపాయలు ఆలయ అధికారులకు విరాళాన్ని అందజేశారు, ఈ సందర్భంగా ఆలయ అర్చకుల విరాళం అందజేసిన దాత బొమ్మినేని ఎర్రిస్వామి కి శాలువా కప్పి పూలహారాలతో ఆయనను సన్మానించారు, ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి సాయి, గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు పాల్గొని ఆయనను అభినందించారు.

## అమావాస్య సందర్భంగా శ్రీశిరిడిసాయిబాబా కు ప్రత్యేక అభిషేకాలు పూజలు



కూడేరు, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)


కూడేరు మండల కేంద్రంలోని శ్రీ శిరిడి సాయిబాబా దేవాలయము నందు మాఘ మాసం నెల ఆఖరి గురువారం కావడంతో ఆలయ కమిటీ చైర్మన్ తుపాకుల భారతి ప్రత్యేక ఏర్పాట్లు భక్తులకు చేశారు, శ్రీ షిరిడి సాయిబాబా కు ప్రత్యేక పూజలు అభిషేకాలతో సాయిబాబా ను సర్వంగ సుద్దరంగా భక్తులకు కనువిందుగా బాబాను అలంకరించి,వివిధ రకాల పుష్పాలతో షిరిడి సాయిబాబాను అలంకరించి భక్తులకు ప్రత్యేక దర్శనం గావించారు, ఈ సందర్భంగా సాయిబాబాను దర్శించుకోవడానికి భారీగా తరలివచ్చారు, స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదములు, అన్నదాన కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తుపాకుల భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.






## విద్యా వైద్య సేవల్లో గవి మఠం - మార్చి4-11వరకు బ్రహ్మోత్సవాలు - 9న శ్రీ చంద్రమౌళీశ్వర మహా రథోత్సవం.



ఉరవకొండ, ఫిబ్రవరి 27 ( అనంత ప్రభ)

ఆంధ్రా,కర్ణాటక తెలంగాణ, మహారాష్ట్రలో గవిమఠ సంస్థానానికి విద్యా వైద్య సేవలు అందించడంలో తరిస్తుందన్న పేరు ఉంది. ఉరవకొండలోశ్రీకరి బసవ స్వామి ప్రభుత్వ హైస్కూల్ బాలుర బాలికల కళాశాల ఏర్పాటు నిమిత్తం 14 ఎకరాల జగద్గురు అప్పట్లో ధారాదత్తం చేశారు. తద్వారా ఎందరో విద్యార్థీ,విద్యార్థులు తమ ప్రతిభా పాట వాలు ప్రదర్శించి అనేక రకాల వృత్తుల్లో స్థిరపడి తమ సత్తా చాటుకోవటానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని ఇంత పెద్ద సువిశాల ఆట స్థలం మైదానం ఏకైక కళాశాల ఉరవకొండ కే దక్కుతుంది.

ఇక రెండవ విషయానికి వస్తే శ్రీ కరిబసవ స్వామి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి పెద్ద ఎత్తున స్థలం కేటాయించారు. గవి మఠానికి చెందిన ఆ స్థలంలో 50 పడకల ఆసుపత్రి నిర్మించి తద్వారా ఎందరో రోగులకువైద్య సేవలు అందించిన ఘనత గవి మఠా టానికే దక్కుతోంది. ప్రస్తుతం 100 పడకల ఆసుపత్రిగా పునరుద్ధరణ చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోతోంది.

విద్యా,వైద్య సేవలు గవిమట్టానికి రెండు తలమానికాలు.:

కోట్ల ధర రూపాయల విలువచేసే స్థలాలు ప్రభుత్వ కళాశాలలకు, ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణాలతో పాటు విద్యుత్ శాఖ కార్యాలయ అవసరాల నిమిత్తం పెద్ద ఎత్తున స్థలం ధారాదత్తం చేశారు. వీటి విలువ సైతం కోట్లాది రూపాయలు చేస్తోంది. ఆధ్యాత్మిక చింతనతో పాటు సమాజ సేవలో తరించాలన్నదే గవి మఠ జగద్గురు సంకల్పం.ఇక ఉద్యోగస్తుల రిక్రియేషన్ నిమిత్తం శ్రీ కరిబసవ రిక్రియేషన్ క్లబ్ ఏర్పాటు కోసం ఉచితంగా స్థలం ఇచ్చారు రిక్రియేషన్ క్లబ్ తో బాటు రెండ %శీ%తస్తుల భవనాలు ఏర్పాటు చేశారు. క్లబ్ వారు పెద్ద పెద్ద భవనాలు కట్టించి వ్యాపార భవనాలు బాడుగుల ఇచ్చి తద్వారా బాడుగులు లబ్ధి పొందుతున్నారు. అయితే సంస్థానానికి వీరినుంచి పైసా ఉపయోగం లేదు. గవిమఠ సంస్థానం చుట్టూ 2500 పైచిలుకు మంది చిరు వ్యాపారస్తులు లబ్ధి పొందుతూ జీవనం సాగిస్తున్నారు.

లబ్ధిదారులు రెండింట మూడో వంతు మైనారిటీ వర్గీయులు కావడం కొసమెరుపు. మఠ సంస్థానం నుంచి స్థలాలు కారు చౌకగా లీజుకు పొంది వేలాది రూపాయలు గుడ్ విల్ తీసుకుంటూ సబ్ లీజులకు ఎక్కవకు ఇవ్వటం ఇక్కడ పరిపాటి.. తద్వారా గవిమఠ సంస్థాన ఆదాయానికి గండిపడుతోంది..770 మఠాలకు మూలమఠం ఉరవకొండ గవి మఠం: ఈ 770 ఉప మఠాలు రాష్ట్ర వ్యాప్తంగా, ఇతర రాష్ట్రాల్లో కర్ణాటక, మహారాష్ట్రల్లో కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాలు,అత్యంత విలువైన భూములు ఉన్నాయి.

ఆంధ్రా,కర్ణాటక,తెలంగాణ మహారాష్ట్రల్లో సైత%శీ% అత్యంత విలువైన భూములు ప్రముఖ కూడల్లో స్థలాలు ఉన్నాయి. ఎందరో దాతలు భక్తులు సమర్పించిన ఆ భూములు స్థలాలు లీజులు సబ్ లీజుదారుల ముసుగుల్లో చేతులు మారుతున్నా ఆస్తుల పరిరక్షణ గురించి పట్టించుకునే నాధులే కరువయ్యారని భక్తులు దుమ్మెత్తిపోస్తున్నారు.

సంపాదనలో దశమ భాగం పరోపకారం కోసం వెచ్చించాలి. సరి కదా గవి మఠానికి ఇచ్చే లీజు మొత్తం కన్నా సబ్లీజు దారులు పొందే లబ్ధి ఎక్కువ. ఎక్కువ.లబ్ధిలో దశమ భాగాన్ని సంస్థానానికి ఇస్తే భక్తులు హర్షిస్తారు. అయితే స్థలాలు అమ్ముకోవటం పొలాలు తమ కుటుంబీకుల పేరిట వారసత్వ సంపదగా విభజన చేసుకొని మఠం సహాయ కమిషనర్ మఠం మల్లికార్జున సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే మఠ ఏజెంటు రాజన్న గౌడ్ , భూములు అమ్ముకున్నారని ఆరోపణలు కేసులపరంపర కొనసాగుతోంది..

ప్రస్తుత ఎనిమిదవ పీఠాధిపతి చెన్న బసవ రాజేంద్ర స్వామి వయోభారంతో తల్లడిల్లుతున్నారు. నడవలేని స్థితి ఆయనది. ఆయన తుంకూరు బెంగళూరులోని అత్యంత విలువ చేసే స్థలాలను ఆయన వ్యక్తిగత సహాయకుడు పవర్ ఆఫ్ అటార్నీ పేరుతో అమ్ముకున్నట్లు పెద్ద ఎత్తున భక్తులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. కోట్లాది రూపాయలు విలువచేసే స్థిర చరాస్తులు మైసూరు మహారాజుచే బహుకరించిన బంగారు గండపెండెరం, విలువైన ఇతర వెండి ఆభరణాలు బ్యాంకు డిపాజిట్లు లాకర్లలో మూలుగుతున్నాయి.

అంగట్లో అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందం:

గవి మఠ సంస్థానం వారు నిత్య అన్నదానం నిర్వహించటం లేదు. ముష్టి 30 మందికి కూడా అన్నదానం పెట్టలేని దౌర్భాగ్యస్థితి. ఉరవకొండ ఆధ్యాత్మిక సంస్థానంలో వేలాదిమంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసి గవి మఠ కీర్తి ప్రతిష్టలు పెంపొందించాలి. అలాగే మఠ ఆస్తులు, రక్షించాలని భక్తులు కోరుతున్నారు







# డయాబెటిస్ ఉందా? అయితే పచ్చి మామిడిని తినడం ప్రారంభించండి



వేసవి వచ్చిందంటే మార్కెట్లో మామిడికాయలు, మామిడి పండ్లు సందడి చేస్తాయి. భారతదేశంలో ప్రజలు అత్యంతగా ఇష్టపడే పండ్లలో మామిడి పండ్లు కూడా ఒకటి. దీనిలో విటమిన్లు, మినరల్స్ డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఆరోగ్యానికి చాలా మంచిది. మండుతున్న వేసవి తాపాన్ని తట్టుకోవడానికి ఈ పోషకాలన్నీ అవసరం. ఎక్కువ మంది మామిడి పండ్లను తినడానికి ఆసక్తి చూపిస్తారు కానీ, పచ్చి మామిడికాయను తినడానికి ఇష్టపడరు. కానీ పచ్చిమామిడిని తినడం కూడా చాలా అవసరం. ఇది శరీరానికి శీతలీకరణాన్ని అందిస్తుంది. వేడి నుంచి తట్టుకునే శక్తిని ఇస్తుంది. దీనిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. కాబట్టి రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో ముందుంటుంది. వేసవిలో వచ్చే వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడడానికి శరీరానికి శక్తిని ఇస్తుంది. పచ్చి మామిడికాయలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు పెరుగుతామనే భయం అవసరం లేదు.

డయాబెటిస్ ఉంటే...
మధుమేహంతో బాధపడే రోగులు సీజనల్‌గా దొరికే పచ్చి మామిడికాయల్ని తినడం చాలా అవసరం. దీన్ని తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. తద్వారా డయాబెటిస్ రోగం అదుపులో ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలోనూ, తగ్గించడంలోనూ పచ్చి మామిడికాయ చాలా సహకరిస్తాయి. కాబట్టి వేసవిలో ప్రతిరోజూ పచ్చిమామిడి ముక్కలను తినడం అవసరం.

పచ్చిమామిడి కాయలు తినడం వల్ల మనకు కావాల్సిన రోజువారి విటమిన్ %సూ%లో 10 శాతం ఇది అందిస్తుంది. ఆరోగ్యకరమైన రోగనిరోధక వ్యవస్థకు ఇది చాలా అవసరం. దీనిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. మామిడిపండ్లలో మెగ్నీషియం, పొటాషియం అధికంగా ఉంటాయి. ఇది రక్తప్రసరణ సవ్యంగా జరగడానికి అవసరం. రక్తప్రసరణ సవ్యంగా జరగడం వల్ల గుండె ఆరోగ్యం బాగుంటుంది. ఈ పోషకాలు రక్తనాళాలు విశ్రాంతి తీసుకోవడానికి కూడా సహాయపడతాయి. అధిక రక్తపోటు రాకుండా అడ్డుకుంటాయి. తక్కువ రక్తపోటు ఉండటం వల్ల గుండెకు మంచిది. ఈ పచ్చి మామిడికాయలో మాంగిఫెరిన్ అని యాక్సిడెంట్ ఉంటుంది. ఇది గుండెకు ఎంతో మేలు చేస్తుంది.

పచ్చి మామిడికాయలో ఒత్తిడిని తగ్గించే పాలీఫెనాల్స్ ఉంటాయి. ఇవి క్యాన్సర్ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. పచ్చి మామిడికాయ తినడం వల్ల లుకేమియా, పెద్ద పేగు, ఊపిరితిత్తులు, ప్రోస్టేట్, రొమ్ము వంటి క్యాన్సర్లు రాకుండా ఇది అడ్డుకుంటుంది. పచ్చి మామిడి కాయని ఈ రోజు నుంచే తినడం అలవాటు చేసుకోండి.

# వేసవిలో ఎటువంటి రోగాన్నైనా తగ్గించే అద్భుతమైన హోమ్ రెమిడీస్ చూడండి

వేసవిలో శరీరం అనేక సవాళ్ళని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఉష్ణోగ్రత, డీహైడ్రేషన్, హీట్ స్ట్రోక్ వంటి అనేక రకాల సమస్యలకు దారితీస్తుంది. వడదెబ్బ, వేడి దద్దుర్లు సాధారణ సమస్యలు. వీటికి తోడు శ్వాసకోశ సమస్యలు తీవ్రమవుతాయి. వేసవి కారణంగా చెమట రూపంలో సోడియం, పొటాషియం వంటి అవసరమైన పోషకాలు క్షీణించిపోతాయి. ఈ సమస్యలను ఎదుర్కోవడానికి హైడ్రేట్ గా ఉండటం, కాటన్ వస్త్రాలు ధరించడం, పీక్ అవర్స్ లో ఎండకు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఎక్కువ మంది ఈ టైమ్ లో జీర్ణక్రియ, చర్మం సమస్యలు, కాలానుగుణ ఫ్లూ, ఇన్ఫెక్షన్స్ బారిన పడుతూ ఉంటారు. వాటిని ఎదుర్కోవాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలి. అటువంటి సమస్యలను పరిష్కరించగలిగే వంటింటి చిట్కాలు మీ కోసం..

అసిడిటీ కోసం లవంగం

అసిడిటీ సమస్య ఉన్నప్పుడల్లా ఒక లవంగం ముక్కని తీసుకుని చప్పరించండి. లవంగంలో ఉండే సహజ నూనె వల్ల అసిడిటీ సమస్యని తగ్గించడంలో సహాయపడుతుంది.

దగ్గు తగ్గించేందుకు ఖర్జూరాలు

పొడి దగ్గుతో బాధపడుతుంటే మీరు రెమిడీని ప్రయత్నించవచ్చు. 6 ఖర్జూరాలు తీసుకుని అర లీటరు పాలలో 25 నిమిషాల పాటు తక్కువ మంట మీద మరిగించాలి. పాలు బాగా మరిగిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసుకుని చల్లారనివ్వాలి. ఈ మిశ్రమాన్ని రోజుకి కనీసం మూడు సార్లు తీసుకుంటే మంచిది.

మైగ్రేన్ కోసం యాపిల్

రోజుకొక యాపిల్ తింటే డాక్టర్ కి దూరంగా ఉండవచ్చని అందరూ చెప్తుంటారు. మైగ్రేన్ నొప్పిని తగ్గించడంలో యాపిల్ సహాయపడుతుంది. అయితే దీన్ని ఖాళీ కడుపుతో మాత్రమే తినాలి.

మొటిమలు తగ్గించే దోసకాయ

దోసకాయలో నీరు సమృద్ధిగా ఉంటుంది. ఖనిజాలు, విటమిన్లతో లోడ్ చేయబడి ఉంటాయి. ఇది చర్మానికి మేలు చేస్తుంది. తురిమిన దోసకాయని మెడ, మొహం, కళ్ళపై అప్లై చేసుకోవచ్చు. ఇది మొటిమలు, బ్లాక్ హెడ్స్ ని తొలగించడంలో సహాయపడుతుంది.

దగ్గుకి తులసి
అధిక వేడి కారణంగా చాలా మందికి వేసవిలో వేడి జలుబు చేస్తుంది. దీన్ని తగ్గించుకునేందుకు తులసి చక్కని హోమ్ రెమిడీ. వెల్లుల్లి రసం, తేనె సమాన పరిమాణంలో తీసుకుని అందులో తులసి రసాన్ని కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజుకి మూడు సార్లు తీసుకుంటే దగ్గుని తగ్గిస్తుంది.

అల్సర్ కి తులసి ఆకులు
తులసిలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఆయుర్వేదంలో ఎన్నో సంవత్సరాలుగా ఉపయోగిస్తున్నారు. ఇందులో యాంటాసిడ్ గుణాలు ఉన్నాయి. రోజుకి కొన్ని తులసి ఆకులు నమిలి మింగితే మంచిది. గ్యాస్ ఉబ్బరం, కడుపులో మంట, అల్సర్లు ఏర్పడకుండా నిరోధించేందుకు సహాయపడుతుంది. ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడంలో దోహదపడుతుంది.



# తేనెలో ఇవి కలిపి రాస్తే నల్ల మచ్చలు మాయం అవుతాయ్..!



తేనెలో అందరికీ అందుబాటులో ఉండేదే. దీనిలో ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. తేనెలో క్యాల్షియం, ఐరన్, సోడియం, ఫాస్ఫరస్, సల్ఫర్, పొటాషియం, విటమిన్ సి, బి వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. తేనె ఆరోగ్యాన్ని రక్షంచడానికే కాదు.. సౌందర్య సంరక్షణకు సహాయపడుతుంది. తేనెలోని యాంటీఇన్ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు.. చర్మ సంరక్షణకు మేలు చేస్తాయి. సూర్యరశ్మి, హార్మోన్ల మార్పుల, వృద్ధాప్యం కారణంగా.. చాలా మంది మహిళలు డార్క్ స్పాట్స్‌తో బాధపడుతుంటూ ఉంటారు. తేనె నల్ల మచ్చలను తేలికపరచి.. చర్మం రంగుతో సమం చేయడానికి సహాయపడుతుంది. మీరు నల్ల మచ్చలతో బాధపడుతుంటే.. ఈ ఐదు ఫేస్ మాస్క్ మీకు సహాయపడతాయి.

తేనె, నిమ్మరసం ఫేస్ మాస్క్..
ని మ్మరసం వంటి నేచురల్ స్కిన్ లైట్నర్స్ చర్మంపై డార్క్ స్పాట్స్‌ను తగ్గించడంలో సహాయపడుంది. ఈ ఫేస్ మాస్క్‌ను తయారు చేయడానికి ఒక టేబుల్ స్పూన్ తేనె, ఒక టేబుల్ స్పూన్ ఫ్రెష్ లెమన్ జ్యూస్ మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని మీ ముఖానికి అప్లై చేసిన తర్వాత.. 15 నుంచి 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వత గోరువెచ్చని నీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి ఒకసారి చేస్తే.. మంచి రిజల్ట్స్ ఉంటాయి.

తేనె, పసుపు ఫేస్ మాస్క్..
పసుపులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ గుణాలు మంటను తగ్గిస్తాయి, చర్మ సమస్యలను నయం చేస్తాయి. ఈ ఫేస్ మాస్క్ చేయడానికి ఒక టేబుల్ స్పూన్ తేనెకు చిటికెడు పసుపు పొడి కలిపి మిశ్రమాన్ని తయారు చేయండి. ఆ తర్వాత ముఖానికి అప్లై చేసి.. 10 – 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వత గోరువెచ్చని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. ముఖంపై నల్లటి మచ్చలు తొలగుతాయి.

తేనె, దాల్చిన చెక్క ఫేస్ మాస్క్..
దాల్చినచెక్కలో యాంటీమైక్రోబయల్ లక్షణాలు ఉంటాయి. మొటిమలతో బాధపడేవారికి దాల్చిన మంచి మెడిసిన్ అనొచ్చు. అంతేకాకుండా, రక్త ప్రసరణను మెరుగుపరచి.. డార్క్ స్పాట్స్‌ను తగ్గిస్తుంది. ఈ ఫేస్ మాస్క్ తయారు చేయడానికి ఒక టేబుల్ స్పూన్ తేనెలో చిటికెడు దాల్చిన చెక్క పొడి వేసి.. మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని మీ ముఖానికి అప్లై చేసి 10 నుంచి 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. మంచి రిజలట్స్ కోసం వారానికి రెండు సార్లు అప్లై చేయండి.

తేనె, బొప్పాయి ఫేస్ మాస్క్..
బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది, ఇది చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయడానికి, డార్క్ స్పాట్స్ రూపాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. పండిన బొప్పాయి గుజ్జు ఒక టేబుల్ స్పూన్ తీసుకుని, దానిలో తేనె కలిపి మెత్తని పేస్ట్‌లా తయారు చేసుకోండి. ఈ మిశ్మాన్ని ముఖానికి అప్లై చేసి.. 15 – 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత గోరువెచ్చని నీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. మంచి రిజల్ట్స్ కోసం.. వారానికి ఒక సారి ఈ మాస్క్ అప్లై చేసుకోండి.

తేనె, కలబంద ఫేస్ మాస్క్..
కలబందలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు డార్క్ స్పాట్స్‌తో సంబంధం ఉన్న ఎరుపు, మంటను తగ్గిస్తాయి. దీనిలో చర్మానికి పోషణ ఇచ్చే.. విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఒక టేబుల్ స్పూన్ తేనె, 1 టేబుల్ స్పూన్ కలబంద గుజ్జు మిక్స్ చేసి పేస్ట్‌లా చేయండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి.. 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే.. డార్క్ స్పాట్స్ మాయం అవుతాయి.

# ఆరుబయట నిద్రపోతే ఎన్ని ప్రయోజనాలో తెలుసా? డోన్ట్ మిస్!

ఆరు బయట నిద్రపోవడం చాలామందికి ఇష్టం. ఎంత మంచి జ్ఞాపకమో అంటూ ఫ్లాష్ బ్యాక్ కి వెళ్లిపోతారు కూడా. అప్పట్లో వేంము అని కథలుగా చెప్పే నడివయస్కులు మీకూ తెలిసే ఉంటారు. ఇప్పుడంటే అంతా ఏసి రూములకు అలవాటయ్యారు. కానీ ఇది వరకు వేసవి వచ్చిందంటే అందరూ ఆరుబయటో, డాబామీదో పడుకునేవారు. నీలాకాశం చూస్తూ నిద్రపోయే అదృష్టం ఈ జెనరేషన్ జనాలకు లేదు మరి. అప్పుడు ఉక్కపోత భరించలేక ఆరుబయట పడుకునే వారు. కానీ అదే ఆరోగ్యానికి మంచిదని కొత్తగా అధ్యయనాలు జరిపి రుజువులు చూపుతున్నారు శాస్త్రవేత్తలు.

ఏ సంఘటన బాధించి డిప్రెషన్ వచ్చేసినా కాసేపలా బయట పడుకుని ఆకాశం వంక చూడమని చెబుతున్నారు మానసిక నిపుణులు. అలా ఆరుబయట గడపడం మనసుకు ఉల్లాసం, శరీరానికి ఆరోగ్యం ఇస్తుందట. ఈ అపార్టుమెంటుల్లో ఆరు బయటకెక్కడికి వెళ్లేదీ అనకండి. సరదాగా అప్పుడప్పుడు కాంపింగులకైనా వెళ్లాలని సలహా ఇస్తున్నారు ఎక్స్ పర్ట్స్.

ఆరుబయట నిద్రపోతే సర్కాడియన్ రిథమ్ సమయం రెండు గంటలు వెనక్కి వెళ్లిందని ఈ మధ్యే జరిపిన ఒక అధ్యయనం ద్వారా నిరూపితమైందట. అంటే మీరు రెండు గంటల ముందుగానే నిద్ర లేచేస్తారన్న మాట. సర్కాడియన్ రీసెట్ అనేది శరీరం అలవాటు పడిన నిద్రా చక్రాన్ని మార్చడమని అర్థం. ఈ సర్కాడియన్ రిథమ్ మీద కాంతి, ఉష్ణోగ్రత వంటి రకరకాల కారణాలు ప్రభావం చూపుతాయి.

ప్రస్తుతం మన చుట్టూ పరిసరాల్లో అంతులేనంత ఆర్టిఫిషియల్ లైట్ ఉంది. ఆరుబయట సమయం గడపడం అంటే ఈ ఆర్టిఫిషియల్ లైట్ కి దూరంగా ఉండడం అని అర్థం. ఇంట్లో బెడ్ రూమ్ లో ఒక్కరే పడుకుంటారు. లేదా ఇద్దరుంటారు. అందులో ఒకరు నిద్ర పోవడమో లేక ఎవరి ఫోన్లు వారు చూస్తుండటమో చేస్తుంటారు. ఇలా కాకుండా ఆరుబయట బృందంగా అప్పుడప్పుడు పడుకుంటే కబుర్లలో సమయం గడుస్తుంది. తెలియకుండానే కన్నుమలిగి ప్రయత్నం లేకుండానే నిద్ర పట్టేస్తుంది. ఇది మనస్సు, శరీరం రెండూ రెజువనేట్ అయ్యేందుకు ఒక మంచి అవకాశమని అద్యయనాలు చెబుతున్నాయి.

ఒత్తిడి లేని జీవితాలు ఈ రోజుల్లో అంత సులభం కాదు. రోజులో దాదాపుగా 8,10 గంటల పాటు తీవ్రమైన ఒత్తిడిలోనే సగం జనాభా బతికేస్తున్నారు. ఇది నాడీవ్యవస్థ మీద, మెదడు పనితీరు మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది. అనుక్షణం ఏదో ఒక యంత్ర శబ్ధంలోనే సమయం గడుపుతున్నాం మనం. అలాకాకుండా ప్రకృతిలోని సహజమైన శబ్ధాల నడుమ, బహిరంగ ప్రదేశాల్లో గడిపినపుడు మన శరీరంలో కార్టిసాల్ స్థాయి గణనీయంగా తగ్గడాన్ని గమనించారట. జర్నల్ ఎన్విరాన్మెంట్ అండ్ బిహేవియర్ లో చెట్లను చూస్తే ఒత్తిడి తగ్గడాన్ని గుర్తించినట్లు ఒక అధ్యయన ఫలితాలుగా ప్రచురించారు.

అర్ధరాత్రి వీచే చల్లని గాలిని ఏ ఏసి గాలితోనూ పోల్చలేము. ఇలా ఆరుబయట గడిపే సమయం చాలా మంచిదని మానసిక, శారీరక ఆరోగ్యాన్ని అందిస్తుందని పరిశోధనలు పునరుద్ఘాటిస్తున్నాయి. అందుకే వేసవిలో ఒక వారం పాటు అలా ఊరెళ్లి ఆరుబయట పడుకోవడం బెటర్. లేదంటే క్యాంపింగ్ చేసుకోవచ్చు కూడాను.




AP 4PG 28 02 2025 FRIDAYqxp_Layout 1 27-02-2025 10:14 PM Page 4



# స్విమ్ సూట్‌లో సాక్షి అగర్వాల్.. నెవ్వర్ బిఫోర్ గ్లామర్ షోతో బిగ్‌బాస్ బ్యూటీ..!





మెగా రియాలిటీ షో బిగ్‌బాస్ ద్వారా పాపులర్ అయిన నటీనటులు మనదేశంలో ఎంతో మంది ఉన్నారు. వీరిలో అందాల భామ సాక్షి అగర్వాల్ కూడా ఒకరు. నటనతో పాటు అందంతోనూ ఈ అమ్మడు సెగలు రేపుతుంటారు. తమిళనాట క్రేజీ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న సాక్షి అగర్వాల్.. సోషల్ మీడియాలో హాట్ హాట్ ఫోటో షూట్‌లతో టాప్ లేపుతుంటారు. తాజాగా ఆమె చేసిన ఫోటో షూట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వివరాల్లోకి వెళితే..

20 జూలై 1990న ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్‌లో జన్మించిన సాక్షి అగర్వాల్ చెన్నై, బెంగళూరులలో చదువుకున్నారు. అనంతరం మార్కెటింగ్ కన్సల్టెంట్‌గా కెరీర్ ప్రారంభించిన సాక్షి మాలిక్.. తొలుత టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, టీసీఎస్‌లో ఉద్యోగం చేశారు. అయితే ఓ ఛారిటీ షో కోసం మోడలింగ్ చేస్తున్న క్రమంలో ఆమె ప్రతిభను గుర్తించిన దర్శకులు పలు వాణిజ్య ప్రకటనల్లో అవకాశాలిచ్చారు. ముఖ్యంగా కోలీవుడ్ స్టార్ సూర్యతో కలిసి మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌కు చేసిన యాడ్ ఫిల్మ్ సాక్షి కెరీర్‌ను మలుపు తిప్పింది.

2013లో ఉద్యోగానికి స్వస్తి చెప్పిన సాక్షి మాలిక్.. నటిగా స్థిరపడాలని నిర్ణయించుకున్నారు. తొలుత మ్యూజిక్ ఆల్బమ్స్‌లో నటించిన సాక్షి.. నయనతార - ఆర్యలు నటించిన రాజారాణిలో ఓ చిన్న పాత్రలో మెరిశారు. ఆ తర్వాత కన్నడలో సాఫ్ట్‌వేర్ గండ, యూగన్, తిరుట్టు వీసీడీ తదితర చిత్రాల్లో నటించారు. ఈ క్రమంలో కోలీవుడ్ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన కాలాలో ఆయనకు కూతురిగా అలరించింది. అనంతరం విశ్వాసం, సిండ్రెల్లా, అర్నామనై 3, భఘీరా తదితర చిత్రాల్లో సాక్షి నటించారు. 12 ఏళ్ల కెరీర్‌లో తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో నటించారు సాక్షి అగర్వాల్. ప్రస్తుతం ఆమె గెస్ట్ చాప్టర్ 2, ది నైట్ చిత్రాల్లో నటిస్తున్నారు.

తమిళ బిగ్‌బాస్ సీజన్ 3లో కంటెస్టెంట్‌గా ఎంట్రీ ఇచ్చిన సాక్షి అగర్వాల్ .. తన మైండ్ , అందంతో హౌస్‌కు గ్లామర్ సోగసులు అద్దారు. దాదాపు 49 రోజుల పాటు బిగ్‌బాస్ హౌస్‌లో ఉన్న సాక్షి తుది వరకు వెళ్లలేకపోయారు. అయితే బిగ్‌బాస్ ద్వారా ఆమె బుల్లితెర ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యారు. కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే తన చిన్ననాటి స్నేహితుడు నవనీత్‌తో ప్రేమలో పడి, ఆయనను పెళ్లి చేసుకున్నారు సాక్షి. ఈ ఏడాది జనవరి 2న గోవాలోని ఓ విలాసవంతమైన హెూటల్‌లో జరిగిన వీరి పెళ్లి వేడుకకు పలువురు ప్రముఖులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించింది. ప్రస్తుతం భర్తతో కలిసి హనీమూన్‌ను ఎంజాయ్ చేస్తున్నారు సాక్షి అగర్వాల్.

సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే సాక్షి అగర్వాల్.. ఎప్పటికప్పుడు తన సినిమాలు, షోలు, ఇతర వ్యక్తిగత వివరాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. తాజాగా బ్లాక్ కలర్ స్విమ్ సూట్‌లో ఆమె చేసిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరి ఇంకేందుకు ఆలస్యం సాక్షి అందాలపై మీరూ ఓ లుక్కేయండి.

# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచిది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# వెంటాడుతోన్న గేమ్ ఛేంజర్.. దిల్‌రాజుపై కేసు, 350 మంది మూకుమ్మడిగా






గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ - క్రియేటివ్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన గేమ్ ఛేంజర్ ఎన్నో అవాంతరాలను దాటుకుని సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. అయితే మిక్స్‌డ్ టాక్ కారణంగా ఈ సినిమా దారుణ పరాజయాన్ని మూటకట్టుకుంది. అయినప్పటికీ చరణ్ - శంకర్ క్రేజ్‌తో పడుతూ , లేస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అయితే నిర్మాత దిల్‌రాజ్‌కు ఇప్పటికీ గేమ్ ఛేంజర్ షాకుల మీద షాకులిస్తోంది.

గేమ్ ఛేంజర్ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ ముద్దుగుమ్మ కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, అంజలి , ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, సునీల్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దాదాపు రూ.450 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో గేమ్ ఛేంజర్ నిర్మించారు దిల్‌రాజు. ఆర్ఆర్ఆర్ తర్వాత రామ్ చరణ్ నటిస్తున్న సినిమా కావడంతో పాటు దిగ్గజ దర్శకుడు శంకర్ తన కెరీర్‌లోనే తొలిసారిగా ఓ స్ట్రెయిట్ తెలుగు చిత్రానికి దర్శకత్వం వహించిన నేపథ్యంలో గేమ్ ఛేంజర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

అయితే మార్నింగ్ షో నుంచే మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న గేమ్ ఛేంజర్‌కు సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం మరింత దెబ్బ తీసింది. కొందరైతే ఏకంగా గేమ్ ఛేంజర్ హెచ్‌డీ ప్రింట్‌ను తీసి ఆన్‌లైన్‌లో స్ట్రీమింగ్ చేయడంతో ఈ సినిమాపై భారీ ఎఫెక్ట్ పడింది. ఇక సినిమా ఫస్ట్ డే కలెక్షన్స్ విషయంలోనూ దుమారం రేగింది. కావాలని ఫేక్ కలెక్షన్స్ వేశారంటూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిసింది. ఈ సినిమాతో నిర్మాత దిల్‌రాజ్ తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు.

గత కొన్నేళ్లుగా సరైన హిట్ లేని దిల్‌రాజు.. ఖర్చుకు వెనుకాడకుండా గేమ్ ఛేంజర్‌ను నిర్మించారు. అయితే ఈ సినిమా అనుకున్న స్థాయిలో సక్సెస్ కాకపోగా ఆయనను పీకల్లోతు అప్పుల్లో ముంచెత్తిందని ఫిలింనగర్ టాక్. మూలిగే నక్క మీద తాటికాయ పడిన చందంగా దిల్‌రాజు నివాసం, కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించడం టాలీవుడ్‌లో కలకలం రేపింది. అయితే ఇదే సంక్రాంతికి అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం లాభాల పంట పండించడంతో దిల్‌రాజు కాస్తంత కోలుకున్నారు.

తాజాగా ఈ స్టార్ ప్రొడ్యూసర్‌కు మరో గట్టి షాక్ తగిలింది. తమకు ఇవ్వాల్సిన పేమెంట్ ఇవ్వలేదంటూ దిల్‌రాజుపై కొందరు జూనియర్ ఆర్టిస్టులు కేసు పెట్టారు. గేమ్ ఛేంజర్ సినిమాలో పనిచేసేందుకు 350 మంది ఆర్టిస్టులు హైదరాబాద్‌కు వచ్చారు. వీరికి రోజుకు రూ.1200 చొప్పున పేమెంట్ ఇస్తామని కో డైరెక్టర్ స్వర్గం శివ హామీ ఇచ్చారట. అయితే సినిమా రిలీజై రోజులు గడుస్తున్నా నేటి వరకు ఆ డబ్బులు చెల్లించకపోవడంతో ఈ 350 మంది జూనియర్ ఆర్టిస్టులు పోలీస్ స్టేషన్ మెట్లెక్కి తమకు న్యాయం చేయాల్సిందిగా ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారం ఫిలింనగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మరి దీనిపై దిల్‌రాజు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# ఛావా ఫస్ట్ రివ్యూ.. రష్మిక మందన్న ఫెర్ఫార్మెన్స్ ఎలా ఉందంటే?

నేషనల్ క్రష్ రష్మిక మందన్న, మోస్ట్ టాలెంటెడ్ హీరో వికీ కౌశల్ జంటగా రూపొందిన చిత్రం ఛావా. మరాఠా కింగ్ ఛత్రపతి సంభాజీ మహారాజ్ జీవితంలో జరిగిన కీలక సంఘటనల ఆధారంగా రూపొంది ఈ సినిమాకు లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఫిబ్రవరి 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్నది. ఈ క్రమంలో ఈ సినిమాపై ప్రముఖ క్రిటిక్ తనదైన శైలిలో రివ్యూ అందించారు. ఈ సినిమాపై సినీ విమర్శకుడు విశ్లేషణ ఏందనే వివరాల్లోకి వెళితే..

ఛావా సినిమా విషయానికి వస్తే.. శివాజీ సాంత్ రచించిన మరాఠీ నవల ఛావా ఆధారంగా తెరకెక్కింది. ఈ సినిమాను దినేష్ విజన్ నిర్మాణ సారథ్యంలో మడోక్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఈ మూవీకి ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలో ఛత్రపతి సంభాజీ మహారాజ్‌గా వికీ కౌశల్, మహరాణి యేసుభాయ్‌గా రష్మిక మందన్న, ఔరంగజేబ్‌గా అక్షయ్ కుమార్,అశుతోష్ రాణా, దివ్య దత్తా, దయాన పెంటీ తదితరులు నటిస్తున్నారు.

చారిత్రాత్మక నేపథ్యంగా రూపొందిన ఛావా సినిమాను అత్యంత భారీగా నిర్మించారు. భారీ సెట్స్, పురాతన కాలం క్యాస్టూమ్స్‌ను డిజైన్ చేశారు. అలాగే టాప్ యాక్టర్లు, టెక్నిషియన్స్ పనిచేశారు. అలాగే దేశవ్యాప్తంగా ఈ సినిమాను క్రేజీగా ప్రమోట్ చేశారు. దాంతో ఈ సినిమా బడ్జెట్ భారీగా పెరిగిపోయింది. ఈ సినిమాను సుమారుగా 130 కోట్ల రూపాయలతో నిర్మించినట్టు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి.

ఛావా చిత్రాన్ని దుబాయ్‌కు చెందిన క్రిటిక్ ఉమేర్ సంధూ సెన్సార్ ప్రీమియర్‌ను చూసి తన రివ్యూను అందించారు. రష్మిక నటించిన ఈ సినిమా యావరేజ్‌గా కూడా లేదు అని షాకింగ్ కామెంట్ చేశాడు. ఈ మూవీ చాలా లౌడ్‌గా, ఇరిటేటింగ్‌గా ఉంది అని కామెంట్ చేశాడు. ఇంకా ఈ సినిమా అంతగా ఆకట్టుకొనేలా ఉండదనే విధంగా ట్వీట్లు చేస్తున్నాడు.

ఛావా సినిమాలో వికీ కౌశల్ పెర్ఫార్మెన్స్ డిజాస్టర్. రాజుల వేషంతో బాగా కనిపించడం లేదు. రష్మిక మందన్న ఈ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్. హిస్టారికల్ స్క్రిప్టులో బూతులు కూడా ఎక్కువగానే ఉన్నాయి. చరిత్రను వక్రీకరించి సినిమాను రూపొందించారు. ఓవరాల్‌గా ఈ సినిమా యావరేజ్‌గా కూడా లేదు. వీఎఫ్ఎక్స్ వర్క్ నాసిరకంగా ఉంది అంటూ ఉమేర్ సంధూ తనదైన శైలిలో తన రివ్యూను పోస్టు చేశారు.

అయితే ఉమేర్ సంధూ ఇచ్చే రివ్యూలు అంచనాలకు దూరంగా ఉంటాయి. ఎక్కువగా కొందరిని టార్గెట్ చేసి రివ్యూ ఇస్తారనే వాదన సోషల్ మీడియాలో ఉంది. ఈ క్రమంలో ఛావాపై ఆయన ఇచ్చిన రివ్యూను జాగ్రత్తగా పరిశీలస్తున్నారు. ఈ మూవీ ఎలా ఉంటుందనేది సినిమా రిలీజ్ తర్వాతే తెలుస్తుంది. థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్ ఉన్న సినిమా అనే ఫీలింగ్‌ను ట్రైలర్లు, ప్రమోషనల్ కాంటెంట్ ద్వారా స్పష్టమైంది.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com